క్లుప్తంగా

ఇద్దరికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు కాకినాడ కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో కాకినాడకు చెందిన అమలాదాసు ప్రసాద్, వాకలపూడికి చెందిన రాజేష్‌కుమార్‌లు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా అదుపులోకి తీసుకుని బుధవారం కాకినాడ కోర్టులో హాజరుపరిచామన్నారు.

త్యాగాల వారసత్వాన్ని నిలబెట్టాలి


సదస్సులో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ వీరబాబు

పెద్దాపురం: భారత స్వాతంత్య్ర పోరాటంలో అమరవీరుల త్యాగాల వారసత్వాన్ని నిలబెట్టడమే నిజమైన దేశభక్తి అని సీఐటీయూ నాయకుడు, మాజీ సర్పంచ్ పలివెల వీరబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో జాతీయోద్యమం–కర్తవ్యాలు– ఆశయాలు అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ దేశ ప్రజలను విడదీసే మతోన్మాదంపై పోరాడడమే అమరవీరులకు మనిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, కరణం ప్రసాదరావు, సిరిపురపు శ్రీనివాస్, మరిడయ్య, గడిగట్ల సత్తిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డ్వామా ఏపీఓ, ఏపీఎంలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న డ్వామాలోని ఏపీఎం, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఈటీసీ మేనేజరు పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటివరకూ రెండు బ్యాచ్‌ల శిక్షణ పూర్తయిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కల పెంపకం, ఉపాధి హామీ పనులపై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనీలకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ప్రారంభిస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నుంచి ఎంటీలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రతీ జిల్లా నుంచి ఐదుగురు చొప్పున 55 మందికి శిక్షణ ఇస్తామన్నారు.

21 నుంచి అఖండ భగవన్నామ సంకీర్తన

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 27 వరకూ అఖండ భగవన్నామ సంకీర్తన కోనసీమ వాడపల్లి, వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో నిర్వహించనున్నట్లు టీటీడీ జిల్లా ధార్మిక సలహా మండలి సభ్యుడు, వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు బుధవారం తెలిపారు. ఏడు రోజుల పాటు 168 గంటలు సప్తాహం జరుగుతుందన్నారు. 28వ తేదీ ఉదయం 6 గంటలకు పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరుగుతుందని చెప్పారు. రోజూ ఉదయం నగర సంకీర్తన, 27వ తేదీ సాయంత్రం శోభా యాత్ర ఉంటాయన్నారు.

చెట్ల నరికివేతకు బహిరంగ వేలం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) లేఅవుట్‌లోని 5.75 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొబ్బరి, మామిడి, టేకు, ఉసిరి, గానుగ, నడికి, నేరేడు, నిద్రగన్నేరు, అశోక, రావి, చింత, యూకలిప్టస్, జీడిమామిడి వంటి 427 చెట్లను నరికి తీసుకెళ్లడానికి ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు.

సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు

సామర్లకోట: స్థానిక 220 కేవీ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం గురువారం నుంచి పెంచనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జొన్నాదుల రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ నెల రోజుల పాటు జరుగుతుందన్నారు. దీని కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు పెద్దాపురం, కాకినాడ, కోనసీమ నుంచి విద్యుత్ సరఫరా అందజేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు సైతం విద్యుత్ ఉండదన్నారు.

భైరవం.. భయానకం..!

- పల్లెల్లో గ్రామ సింహాల స్వైర విహారం
- పిల్లలు, వృద్ధులపై ఎక్కువగా దాడి చేస్తున్న శునకాలు


చంద్రమాంపల్లి ప్రధాన రహదారిలో మితిమీరిన శునకాలు


తిరుపతి గ్రామంలో వీధుల్లో కుక్కల స్వైర విహారం

పెద్దాపురం: 'ఇందుగలవు.. అందులేవన్న సందేహం వలదు..' ఏ వీధిలోనైనా వెతక్కుండానే దర్శనమిచ్చు భైరవుండు. దొరికినవారిపై దొరికినట్టుగా దాడి చేసి పిక్కలు పీకేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ దారినపోయేవారిపై పడి కరిచేస్తున్నాయి. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా ఒంటరిగా వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు కుక్కలకు భయపడి అవి ఉన్న దారి నుంచి కాకుండా ఇతర మార్గాల నుంచి పయనించాల్సిన దుస్థితి నెలకొంది. వీధి కుక్కలు మరీ శ్రుతిమించిపోతున్న వీధుల్లోనైతే ప్రజలు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చేతి కర్ర చేతబూనితేనే బయటకు

పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు రెండు మండలాల్లో వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. నిత్యం ఏదో మూల ఎవరో ఒకరు కుక్కకాట్లకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు కర్ర చేతబూనితే తప్ప బయటకు వెళ్లలేకపోతున్నారు. ప్రధాన కూడళ్లు, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలకుండా తరిమితరిమి కరుస్తున్నాయి. కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇరవై వేలకు పైగా కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు.

చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా

పంచాయతీరాజ్ యాక్ట్ సెక్షన్ 92 ప్రకారం గ్రామాల్లో ప్రజలను వీధి కుక్కల నుంచి రక్షించాల్సిన బాధ్యత పంచాయతీ పాలకులపై ఉంది. ముందుగానే కుక్కలను పట్టుకుని పశువైద్యాధికారితో యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) సూది మందు వేయించాలి. కుక్కల సంఖ్య పెరగకుండా ఉండేందుకు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. పెంపుడు కుక్కల యజమానులు పంచాయతీలో లైసెన్సు తీసుకుని, పన్ను కూడా చెల్లించాల్సి ఉంది. కానీ పంచాయతీ పాలకులు మాత్రం కుక్కల సమస్య తమది కాదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకూ గ్రామాల్లో కుక్కల సంఖ్య జన సంఖ్యను మించిపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిలో మూడు వేల మంది బాధితులు

కేవలం ఏడాది కాల వ్యవధిలోనే ఒక్క పెద్దాపురం మండలంలోనే శునక బాధితుల సంఖ్య వెయ్యి దాటిందంటే తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు. 2022 జనవరి నుంచి 2023 జనవరి వరకూ పెద్దాపురం నియోజకవర్గంలో 3,074 మంది కుక్క కాట్లకు చికిత్స పొందారు. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే.. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారి సంఖ్య మరో రెండింతలు ఉంటుందని అంచనా. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకునైనా అధికారులు స్పందించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

2022 జనవరి నుంచి 2023 జనవరి వరకూ వివిధ ఆస్పత్రుల్లో నమోదైన కేసులు

ప్రాంతం	పీహెచ్‌సీ/సీహెచ్‌సీ	నమోదైన కేసులు
పెద్దాపురం	సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)	1,062
సామర్లకోట	సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)	1,291
పులిమేరు	ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)	275
కాండ్రకోట	ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)	255
వేట్లపాలెం	ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)	191
మొత్తం		3,074

శునకాలను నియంత్రించాలి



నా రెండేళ్ల కుమారుడిపై వీధి కుక్క దాడి చేసి కరిచింది. పెద్దాపురం సీహెచ్‌సీలో చికిత్స చేయించాం. వీధి కుక్కలు పేట్రేగిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని గ్రామాల్లో శునకాలను నియంత్రించాలి.

– నానేపల్లి అమ్మాజీ, గృహిణి, చంద్రమాంపల్లి, పెద్దాపురం మండలం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



గ్రామాల్లో కుక్కలను నియంత్రించాలని ఫిర్యాదులొస్తున్నాయి. కుక్కలను నియంత్రించాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం ఆసుపత్రులన్నింట్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచింది.

– వరసాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, వాలుతిమ్మాపురం, పెద్దాపురం మండలం

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు


హాజరైన కన్వీనర్లు

- అదే లక్ష్యంతో అంతా పనిచేయాలి
- వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు దిశా నిర్దేశం

పిఠాపురం: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి సీఎం చేయడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. పిఠాపురం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ల బీమా ప్రక్రియ ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్ని ప్రసంగించారు. కన్వీనర్లను నియమిస్తున్నప్పుడు పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం జీవిత బీమా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, ఇన్‌చార్జిలు, గృహ సారథులకు బీమా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వారంతా రానున్న కాలంలో పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ నియమ నిబంధనలకు లోబడి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గొల్లప్రోలు జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, జేసీఎస్ ఇన్‌చార్జిలు బాలిపల్లి రాంబాబు, ఉమ్మిడి జాన్, వెంకటేష్, మొగలి సాంబశివరావు, కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, గంగ్రేటి శ్రీరామచంద్రమూర్తి, అరిగెల రామయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా ఓటర్ల రీసర్వే


వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేవీఎస్ రామారావు

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల రీసర్వే ప్రక్రియ మరింత వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ ఛాంబర్‌లో బుధవారం ఓటర్ల సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేవీఎస్ రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీసర్వే కార్యక్రమం మరింత వేగవంతంగా చేపడతామన్నారు. ఓటర్ల జాబితాలపై అపోహలు తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఫారం–6కు సంబంధించి ఇప్పటివరకూ 740 దరఖాస్తులు, ఫారం–7కు సంబంధించి 498 దరఖాస్తులు, ఫారం–8కు సంబంధించి 665 దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, ఎన్నికల డీటీ కాంతారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రంధి సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, తాటికొండ అచ్చిరాజులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ బుధవారం తెలిపారు. అధికారులు హాజరుకావాలని సూచించారు.

పట్టణ స్థాయి క్రికెట్ విజేత చిరుత లెవెన్స్


క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతి అందజేసిన సీఐ దుర్గాప్రసాద్, కౌన్సిలర్

సామర్లకోట: అబ్దుల్ కలాం మెమోరియల్ పేరుతో వీఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఒక రోజు క్రికెట్ టోర్నమెంట్‌లో చిరుత లెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు సీఐ కె.దుర్గాప్రసాద్ బుధవారం రాత్రి బహుమతులు అందజేశారు. ప్రథమ విజేతకు రూ.5 వేలు, షీల్డు, ద్వితీయ విజేతకు రూ.3 వేలు, షీల్డు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీకి ఏర్పాట్లు


కొత్తపల్లిలో చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

నేడు పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు

కొత్తపల్లి: పిల్లల్లో వచ్చే చాలా అనారోగ్య సమస్యలకు మూలం నులి పురుగులు అని వైద్యులు చెబుతున్నారు. పిల్లల కడుపులో నులిపురుగు ఉన్నట్లు గుర్తిస్తే సులభ పద్ధతిలో వైద్యం చేయించవచ్చు. తగిన చికిత్స అందిచక పోతే ప్రమాదకరంగా మారే అవకాశాలు ఎక్కువ. కొత్తపల్లి మండలంలోని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న సుమారు 2000 మందికి ఆల్బెండజోల్–400 ఎంజీ మాత్రలు వేయాలనే లక్ష్యంతో వైద్యారోగ్యశాఖ అధిరులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 80 శాతం మంది పిల్లలకు మాత్రలు మింగించారు. మిగిలిన 20 శాతం 17న పూర్తి స్థాయిలో ఈ మాత్రలు పంపిణీ చేస్తారు.

మాత్రలు ఉచితంగా వేస్తాం



పిల్లలకు నులిపురుగులు రాకుండా తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణులు కూడా ఈ మాత్రలు తీసుకోవచ్చు. 17న మిగిలిన పిల్లలకు వేయటం జరుగుతుంది. ఇంకా ఎవరికైనా పెద్దవారికి కూడా మాత్రలు కావాలంటే వైద్యశాలలో సంప్రదించవచ్చు.

– డాక్టర్ మౌనిక, వైద్యాధికారి, కొత్తపల్లి

చోరీకి యత్నించారంటూ మహిళల అప్పగింత


స్థానికులు అప్పగించిన మహిళలను విచారిస్తున్న హెచ్‌సీ మూర్తి

పెద్దాపురం: ఓ ఇంట్లో చోరీకి యత్నించారంటూ ఇద్దరు సంచార జాతి మహిళలను పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం ఉదయం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం శివాలయం వీధిలో నివాసముంటున్న ఓ వృద్ధురాలి గదిలోని పాత సామాన్లను ఆరుగురు సంచార జాతి మహిళలు చోరీ చేసేందుకు యత్నించారంటూ స్థానికులు వారిలో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిద్దరూ కిర్లంపూడి మండలం సోమవరం మార్కెట్‌లో నివాసముంటూ ఊరూరా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ జీవనం సాగించేవారని పోలీసుల విచారణలో తేలింది. అయితే చోరీ జరిగినట్లుగా వృద్ధురాలి నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని, స్థానికుల అపోహ మినహా అక్కడెలాంటి చోరీ జరగలేదని పోలీసులు తెలిపారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న పశు సంవర్థక అధికారి శ్రీమన్నారాయణ, గ్రంథాలయ అధికారి నళినీ ప్రియ

కొత్తపల్లి: ఉత్తమ సేవలు అందించిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కాకినాడలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్, ఎంపీ వంగా గీత ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. అందుకున్న వారిలో కొత్తపల్లి పశుసంవర్థక అధికారి శ్రీమన్నారాయణ, ఉప్పాడ గ్రంథాలయ అధికారి టి.నళినీ ప్రియ ఉన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళులు


వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: గొల్లప్రోలు బీజేపీ నేతల ఆధ్వర్యంలో దివంగత ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. నగర పంచాయతీ బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో పార్టీ నేతలు వాజ్‌పేయికి నివాళులు అర్పించారు. పార్టీ నేతలు ఉలవలశెట్టి శ్రీను, వియ్యపు రాములు, కొత్తెం నాగేశ్వరరావు, తొగరు వెంకటరావు, రామిశెట్టి శ్రీను, ఈపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి 'సిటిజన్స్'

ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి


సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

పిఠాపురం: ఓఎన్‌జీసీ సహకారంతో సిటిజన్స్ ఫౌండేషన్ ద్వారా ఏడు అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధి చేస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్‌కే దుర్గాదేవి తెలిపారు. పిఠాపురం మండలం నర్సింగపురంలో బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నర్సింగపురంలో ఉన్న ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే తల్లులకు పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిచాలని సిటిజన్స్ ఫౌండేషన్‌ను కోరామన్నారు. దీనిపై స్పందించిన వారు తమ వంతు సహకారం అందించడానికి ముందుకు వచ్చారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సిటిజన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ కె.రమేష్ మాట్లాడుతు ఓఎన్‌జీసీ సహకారంతో సిటిజన్స్ ఫౌండేషన్ ద్వారా ఏడు అంగన్‌వాడీ సెంటర్లలో బాలింతలు, గర్భిణులకు, పిల్లలకు తగిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పోషక విలువలు కలిగిన ఆకుకూరలు అందజేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత వులవల భూషణం, ఏఎన్‌ఎం పి.మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్లు గ్రామ పెద్దలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ఐడియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికలను హ్యాండ్‌బాల్ సంఘ కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 16 మందితో కూడిన జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు ప్రకాశం జిల్లా జరిగే పోటీలలో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఎంపికల నిర్వహణలో ఐడియల్ కళాశాల పీడీ ఫణికుమార్, ఎంఎస్ఎన్ కళాశాల పీడీ అజ్జిబాబు, హ్యాండ్‌బాల్ కోచ్ అనిల్, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి ఫలప్రదం చేయండి

కాకినాడ రూరల్: పర్యావరణహితం కోరుతూ 19వ తేదీన కాకినాడ స్మార్ట్ సిటీలో 11 వేల ఫలసాయమిచ్చే మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ శాఖ పిలుపు ఇచ్చింది. రమణయ్యపేటలో బెరాకా బ్లెస్సింగ్ చర్చ్‌లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు సామాజిక కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కౌన్సిల్ కాకినాడ శాఖ అధ్యక్షుడు రిక్కీ గూటమ్, కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ ఆ వివరాలను విలేకరులకు తెలిపారు. కాకినాడ కేగ్ మెమోరియల్ చర్చి వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 19న ఉదయం మొక్కలు నాటుతారన్నారు. నగరంలో 400 ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. జోసెఫ్ బెన్నీ, దైవ, పరిమి ఐజాక్, విస్సా విజయకుమార్, అంకిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాల పంపిణీ ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణాసేవాసమితి సభ్యుల బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు వీఎస్ గాంధీ చేతుల మీదుగా దాత సహకారంతో ప్రతిరోజు 80 మంది చిన్నారులకు నిర్వహించే ఉచిత పాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత ఏడాది మంచి మార్కులతో ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. హిందీలో 96 మార్కుల సాధించిన విద్యార్థిని మనీషాకు నగదు బహుమతి, హిందీ నిఘంటువు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.